క్లుప్తంగా

విద్యార్థులకు పోటీలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం సిద్ధంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం ఇండియన్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాలకు తడిచెత్త, పొడిచెత్త సేకరణకు డస్ట్‌బిన్లు అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మేనేజర్ అన్వేష్, అసిస్టెంట్ మేనేజర్ ఉపేంద్ర, ఉపాధ్యాయుడు రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్యం


రోగిని పరీక్షిస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా మారుమూల ప్రాంత ప్రజల ఇంటి ముంగిటకే మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. గోవిందరెడ్డిపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 70 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఈఈగా మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో అర్బన్ ఇన్‌చార్జ్ ఈఈగా వ్యవహరిస్తున్న మునిచంద్రను రెగ్యులర్ ఈఈగా నియమిస్తూ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పీలేరు ఈఈగా ఉన్న ఆయనకు చిత్తూరు ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం పీలేరు ఇన్‌చార్జ్ ఈఈగా అదనపు బాధ్యతలు కట్టబెట్టారు.

వైభవంగా తిరుపతి గంగమ్మ జాతర

- నేడు జలధితో జాతర పరిసమాప్తం


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట పంచాయతీ కమ్మపాళ్యంలో తిరుపతి గంగమ్మ జాతర బుధవారం వైభవంగా నిర్వహించారు. దేదీప్యమైన కాంతులతో అమ్మవారు బుధవారం తెల్లవారుజాము నుంచి భక్తుల దర్శనార్థం కొలువు దీరారు. శిరస్సు మెరవణి అనంతరం అమ్మవారిని విశ్వరూప దర్శనానికి ఉంచారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, పొరుగు రాష్ట్రమైన కర్ణాటకకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

కోలాహలంగా శిరస్సు మెరవణి

అమ్మవారి శిరస్సు మెరవణి మంగళవారం అర్ధరాత్రి గ్రామ శివారులోని చర్చి వద్ద నుంచి ప్రారంభమైంది. మంగళ వాయిద్యాల నడుమ గ్రామ వీధుల్లో సాగి గ్రామ చివరన మారెమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారిని ఆశీనులు చేశారు. ఊరేగింపులో ప్రతి ఇంటి వద్ద అమ్మవారి శిరస్సుకు హారతులిచ్చి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాణసంచా, సౌండ్ సిస్టం, లైటింగ్ అందరినీ ఆకట్టుకుంది.


అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న మహిళలు

ఫ్యామిలీ డాక్టర్



పెద్దపంజాణి: మండలంలోని బట్టందొడ్డిలో బుధవారం పెద్దపంజాణి పీహెచ్‌సీ వైద్యాధికారి టి.మురళి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లారు. వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో అడిగి తెలుసుకుని సూచనలు-సలహాలు ఇచ్చారు. గర్భవతులు రక్తహీనత నివారణ కోసం మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామస్తులకు తెలియజేశారు. ఎంఎల్‌హెచ్‌పీ అరుణ కుమారి, ఏఎన్ఎం వసంత కుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మెకానిక్ డే వేడుకలు

చిత్తూరు కార్పొరేషన్: ప్రపంచ టూ వీలర్ మెకానిక్ డే సందర్భంగా బుధవారం నగరంలో వేడుకలు నిర్వహించారు. చిత్తూరు టూ వీలర్స్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిత్తూరులో పేదలకు అన్నదానం చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మున్నా, మురగ షణ్ముగం, బాల, దేవా, సూరి, సంపత్, కృష్ణమూర్తి, ఓటీకే మురగ పాల్గొన్నారు.

టీకాలతో రక్షణ

- ప్రతి బుధ, శనివారాల్లో ఉచితంగా టీకాలు
- ప్రభుత్వాస్పత్రుల్లో సరిపడా నిల్వలు


టీకాలు వేయించాల్సిన కాల పట్టిక


బిడ్డకు టీకాలు వేస్తున్న సిబ్బంది

పూతలపట్టు: వ్యాధుల నుంచి జీవితాంతం రక్షణ పొందాలంటే వ్యాధినిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. అప్పుడే పుట్టిన చిన్నారుల వరకు ప్రభుత్వం సూచించిన సమయాల్లో ఆయా టీకాలు, వ్యాక్సిన్‌లు వేయిస్తే వ్యాధులు దరిచేరకుండా జీవితాంతం ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చు. ఐతే చాలామంది, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల టీకాలపై సరైన అవగాహన లేక వివిధ రకాల వ్యాధులకు గురవుతూ ఇల్లువళ్లూ గుల్ల చేసుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలూ కోల్పోతున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ప్రతి శని, బుధ వారాల్లో గర్భిణులు, చిన్నారులకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు.

వ్యాక్సిన్‌లు వేసేది ఇలా..

- గర్భిణిగా నిర్ధారణ అయిన మూడు నెలలు నిండిన తర్వాత టీటీ ఇంజక్షన్ వేయాలి. నెల రోజుల వ్యవధిలో మరో టీటీ ఇంజక్షన్ వేయాలి. వీటితో పాటు ఐరన్ ఫోలిక్, కాల్షియం టాబ్లెట్లు ఇస్తారు. ప్రసవం అనంతరం ఐరన్ టాబ్లెట్స్ ఇస్తారు.
- అప్పుడే పుట్టిన చిన్నారికి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హెపటైటిస్-బి డోసు వేయాలి. వీటివల్ల పోలియో, పచ్చకామెర్ల వ్యాధి నుంచి రక్షణ లభిస్తుంది.
- 14 రోజుల వ్యవధిలో టీబీ రాకుండా బీసీజీ టీకా వేయించాలి.
- ఆరు, 14 వారాల్లో ఐపీవీ చుక్కలు వేయించాలి, వీటితో పాటు 6, 10, 14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటా వాలెంట్ వేయించాలి. వీటి వల్ల కోరింత దగ్గు, కంఠసర్పి, ధనుర్వాతం, మెదడువాపు, పచ్చకామెర్ల వంటి వ్యాధుల నుంచి చిన్నారిని కాపాడుకోవచ్చు.
- తొమ్మిది నెలల నుంచి 12 నెలల వ్యవధిలో తట్టు వ్యాధి రాకుండా మీజిల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్-ఏ చుక్కలు వేయించాలి.
- 16 నెలల నుంచి 24 నెలల వ్యవధిలో బూస్టర్ డోసు డీపీటీ, మీజిల్స్, విటమిన్-ఏ ఓపీవి వేయించాలి. ఐదేళ్లు పూర్తయిన తర్వాత డీపీటీ డోసు వేయించాలి.
- 10,16 సంవత్సరాలు పూర్తయితే టెట్నాస్(టీటీ) వేయించాలి.
- తొమ్మిది నెలల నుంచి ఐదేళ్ల వయసు వరకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి విటమిన్-ఎ చుక్కలు మొత్తం తొమ్మిది డోసులు వేయించాలి.

టీకాలు తప్పనిసరి..



గర్భిణులు, చిన్నారులకు నిర్దేశించిన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయాలి. వీటివల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు. గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఈ టీకాలపై తమ సిబ్బంది ద్వారా నిరంతరం అవగాహన కల్పిస్తున్నాం.

–సురేఖ, మెడికల్ ఆఫీసర్, పీహెచ్‌సీ, యాదమరి మండలం

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం

- ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు


చిత్తూరులో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ సమస్యల పరిష్కారం కోసమే 'విద్యుత్ సమస్యల పరిష్కారవేదిక' కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. బుధవారం జిల్లాలోని డివిజన్ కార్యాలయాల్లో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. సమస్యలపై మొత్తం 79 ఫిర్యాదుల అందాయని, వాటిలో 14 సమస్యల్ని పరిష్కరించామన్నారు. మిగిలిన వాటికి ఆర్థికపరమైన సమస్యలతో ముడి పడి ఉన్నాయని, వాటికి అనుమతులు తీసుకుని పరిష్కరిస్తామన్నారు. బిల్లింగ్ సమస్యలు 14, కేబుల్, కరెంటు పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు..ఇత్యాది సమస్యలపై వినతులు వచ్చినట్టు వివరించారు. చిత్తూరులో ఫిర్యాదులను ఈఈ మునిచంద్ర స్వీకరించారు. కార్యక్రమంలో డీఈ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్ ఆర్ఐగా సుధాకర్

చిత్తూరు అర్బన్: జిల్లా పోలీసుశాఖలో ఆర్ముడు రిజర్వు (ఏఆర్) విభాగం ఆర్ఐగా సుధాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న నీలకంఠేశ్వరరెడ్డి ఉద్యోగోన్నతిపై బదిలీ కావడంతో.. హోంగార్డ్స్ ఆర్ఐగా పనిచేస్తున్న సుధాకర్‌ను ఏఆర్ ఆర్ఐగా నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: హిందువులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన ఎంపీ రాహుల్‌గాంధీని వెంటనే బర్తరఫ్ చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆ పార్టీ రాష్ట్ర నాయకులు చిట్టిబాబు మాట్లాడారు. హిందు దేవుళ్ల ఆయుధాలు ధరించి హింసలకు పాల్పడ్డారని రాహుల్ చెప్పడం దారుణమన్నారు. రాహుల్ అనుచిత వ్యాఖ్యలనుత ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామభద్ర, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

5న పలమనేరులో 'డయల్ యువర్ డీఎం'

పలమనేరు: పలమనేరు ఆర్టీసీ డిపోలో ఈనెల 5న డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు డీఎం టీకే స్వామి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని ప్రయాణికులు వారి సమస్యలు, సలహాలు, ఫిర్యాదులను 5వ తేదీ ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య 9959225678 సెల్ నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

డెంగీపై అవగాహన ర్యాలీ


ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, వైద్యసిబ్బంది

ఐరాల: డెంగీ వ్యాధిని నివారించేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని కాణిపాకం పీహెచ్‌సీ డాక్టర్ స్వాతిసింధూర అన్నారు. పుత్రమద్దిలో బుధవారం డెంగీ మాసోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఏడిస్ అనే దోమ కాటు వల్ల డెంగీ వస్తుందన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డెంగీ కేసులు పెరిగే అవకాశం ఉందని, కొన్ని రకాల డెంగీ కేసులు ప్రాణాంతకమని తెలిపారు. ఇంటి ఆవరణలో, పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో విద్యార్థులతో కలిసి డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్ఈఓ శివయ్య, పీహెచ్ఎన్ వేదవతి, సూపర్‌వైజర్ మనోహర్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పట్టుగూళ్ల ఉత్పత్తి పెంపునకు చర్యలు

- రైతులు, రీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి
- ఆరోగ్యశ్రీ నిధులతో అవసరమైన పరికరాలు కొనండి
- ఆస్పత్రిలో ఖాళీ పోస్టులపై ఉన్నతాధికారుల దృష్టికి
- రోగులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం
- పట్టుగూళ్ల కేంద్రం, ఏరియా ఆస్పత్రుల తనిఖీలో కలెక్టర్ సుమిత్ కుమార్


పలమనేరులోని పట్టుగూళ్ల మార్కెట్‌లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్


ఏరియా ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

పలమనేరు: జిల్లాలోనే ఎక్కువగా పట్టుగూళ్ల ఉత్పత్తికి పేరున్న పలమనేరు ప్రాంతంలో మరింతగా వాటి ఉత్పత్తులను పెంచేందుకు పట్టుపరిశ్రమశాఖ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశించారు. పట్టణ సమీపంలోని పట్టుగూళ్ల మార్కెట్, రీలింగ్ యూనిట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఇక్కడి పట్టురైతుల సమస్యలను, అనంతరం రీలర్లతో మాట్లాడి పట్టుదారం ధరలను తెలుసుకున్నారు. రీలర్లకు అవసరమైన ఏర్పాట్లను చేయడానికి అధికారులు చొరవ చూపాలన్నారు. ఈ ప్రాంతం పట్టు పురుగుల పెంపకానికి అనుకూలమైన వాతావరణం ఉన్న నేపథ్యంలో రైతులకు మరింత ప్రోత్సాహకం అందివ్వాలన్నారు. దీనిపై మరింత అధ్యయనం చేసి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సెరికల్చర్ జేడీ శోభారాణి, స్థానిక ఏడీ కిశోర్‌నాయక్, మార్కెట్ అధికారి అనిల్‌కుమార్, గ్రైనేజ్ ఇన్‌చార్జ్ నగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి తనిఖీలో..

పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. అన్ని వార్డుల్లో పర్యటించారు. రోగులతో మాట్లాడారు. సమస్యలపై ఆరా తీశారు. ముఖ్యంగా ఆస్పత్రికి అవసరమైన కొన్ని పరికరాలు కావాలని వైద్యులు కోరారు. నవజాత శిశువులకు అవసరమైన వార్మర్స్, ల్యాబ్ రీ-ఏజెంట్స్, ఆపరేషన్ థియేటర్‌లో బాయిల్ ఆపరేటర్లు లేవని వైద్యులు నివేదించారు. దీనిపై స్పందించిన కలెక్టర్.. ఆరోగ్యశ్రీ నిధులతో వాటిని వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించారు. అలాగే దీనికిగాను అత్యవసర సాయంగా కలెక్టర్ నిధుల నుంచి రూ.2లక్షలను మంజూరు చేశారు. ఆస్పత్రిలో చిన్నపిల్లల వైద్యుడు, ఎముకల డాక్టర్, చర్మవ్యాధి నిపుణులు, ఫిజీషియన్, రేడియాలజిస్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడుతామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఆర్డీఓ మనోజ్‌రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ మమతారాణి, ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన భవిష్యత్తుకు సహకార సంఘాలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

- పోస్టర్ల ఆవిష్కరణలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్: మెరుగైన భవిష్యత్తుకు సహకార సంఘాలు ముఖ్యమని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అంతర్జాతీయ సహకార దినోత్సవం పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ప్రతి ఏటా జూలై మొదటి శనివారం అంతర్జాతీయ సహకార దినోత్సవం జరుపుకుంటారన్నారు. ఈ నెల 6న 102వ అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. దినోత్సవం రోజున 'సహకారం మెరుగైన భవిష్యత్తు' అనే అంశం ప్రాధాన్యతను తెలియజేస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి నాగవర్ధన, విభాగ సహకార అధికారి వనజ, జిల్లా సహకార ఆడిట్ అధికారి బ్రహ్మానందరెడ్డి, సహకార విద్యాధికారి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుకు పరిహారం పంపిణీ

- చెక్కును అందజేసిన కలెక్టర్


జగన్నాథంకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని పెనుమూరు మండలం ఎల్లంపల్లెకు చెందిన రైతు జగన్నాథంకు రూ.35 వేల నష్టపరిహారాన్ని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అందజేశారు. బుధవారం కలెక్టరేట్‌లో బాధిత రైతుకు కలెక్టర్ చెక్కును అందజేశారు. ఆయన మాట్లాడుతూ, ఇటీవల జగన్నాథం పండించిన నేరేడు పంట, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అగ్ని ప్రమాదంలో దెబ్బతిన్నాయన్నారు. బాధిత రైతును ఆదుకోవాలని పెనుమూరు తహసీల్దార్ కలెక్టరేట్‌కు నివేదికలు పంపారని, పరిశీలించిన అనంతరం ఆ రైతుకు సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ ఫండ్) నుంచి రూ.35 వేలు ఆర్థిక సహాయం చేసినట్లు కలెక్టర్ చెప్పారు.

పోలీసుల పార్కింగ్ షెడ్డు ప్రారంభించిన ఎస్పీ


వాహనాల షెడ్డు ప్రారంభిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని ఆర్ముడు రిజర్వు కార్యాలయంలో పోలీసుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ద్విచక్ర వాహన పార్కింగ్ షెడ్డును బుధవారం ఎస్పీ మణికంఠ ప్రారంభించారు. అనంతరం బ్యాండు సిబ్బందికి యూనిఫామ్ పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, మహబూబ్ బాషా, ఇలియాజ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ ఉద్యోగులకు విరమణ సన్మానం


ఉద్యోగులకు సన్మానిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో ఉద్యోగ విరమణ పొందిన వారిని బుధవారం సన్మానించి వీడ్కోలు పలికారు. ఇక్కడ డ్రైవర్‌గా పనిచేసిన కుమార్, ప్రజారోగ్యశాఖలో పనిచేసిన వెంకటాచలం, నాగేశ్వరరావులను అధికారులు సన్మానించారు. 40 ఏళ్లకు పైగా మునిసిపాలిటీకి ఉద్యోగులు అందించిన సేవలు మరువలేనివన్నారు. అనంతరం ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్ నగదును అందచేసి, సన్మానించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోమతి, సహాయ కమిషనర్ రామకృష్ణుడు, డీఈలు రమణ, వెంకటప్రసాద్, మేనేజర్ గోపాలకృష్ణవర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

డేంజర్..డేంజర్



రోడ్డు మధ్యలో ఉన్న గుంత

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని కొంగారెడ్డిపల్లెలో నగరపాలక కమిషనర్ బంగ్లాకు వెళ్లే దారిలోని కూడలి వద్ద రోడ్డు మధ్యలో ఉన్న గుంత ప్రమాదాలకు తావిచ్చేలా ఉంటోంది. చాలా నెలలుగా ఆ గుంత మూయకుండా అలాగే ఉండడంతో అటు వైపు వెళ్లే పలు వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోజూ అటు వైపు వెళ్లే నగరపాలక కమిషనర్ అరుణ దీనిపై దృష్టి సారించి, గుంత మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు.

గ్యాస్ ఈకేవైసీకి బారులు


చిత్తూరులోని ఓ గ్యాస్ ఏజెన్సీ వద్ద క్యూకట్టిన వినియోగదారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయించుకునేందుకు గ్యాస్ ఏజెన్సీల కార్యాలయాల వద్ద బారులు తీరుతున్నారు. పాత వినియోగదారులు బయోమెట్రిక్ ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం ఏడాది క్రితం ఆదేశాలు జారీ చేసింది. తొలుత ఈ ప్రక్రియ మందకొడిగా సాగింది. అయితే గత 20రోజులుగా మాత్రం ఈకేవైసీ చేయించుకోవడానికి వినియోగదారులు ఏజెన్సీ కార్యాలయాలను చుట్టిముట్టేస్తున్నారు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు కూడా వారు క్యూకడుతున్నారు. మూడు సిలిండర్లు ఉచితానికే అని ప్రచారంలోకి రావడంతో ఇలా క్యూకట్టారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


మొగిలిమిట్టూరులో విద్యార్థి తల్లితో మాట్లాడుతున్న అజయ్‌కుమార్‌రెడ్డి

బంగారుపాళెం: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాలల సమన్వయకర్త అజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. విద్యాప్రవేశం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని మొగిలిమిట్టూరు, మొగిలివారిపల్లె, మొగిలి, లక్ష్మీపురం, గాండ్లపల్లె గ్రామాల్లో బడి బయట పిల్లల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన బడి మానేసిన విద్యార్థుల తల్లిదండ్రులతో చదువు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. చదువుకుంటున్న పిల్లలను మధ్యలో బడి మాన్పించి ఇతర పనులు చేయించరాదని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేదవిద్యార్థులు చదువుకునేందుకు అవసరమైన సదుపాయాలు ఉన్నాయన్నారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో పిల్లలకు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారన్నారు. ఆయా పాఠశాలల పరిధిలోని ఉపాధ్యాయులు గ్రామాల్లో పర్యటించి బడిఈడు పిల్లలు, బడిబయట పిల్లలను సర్వేచేసి పాఠశాలలో చేర్పించాలన్నారు. ఎంఈఓ నాగేశ్వర్‌రావు, మొగిలిమిట్టూరు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం చెంగల్‌రెడ్డి, సీఆర్పీ ప్రేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.